సాక్షి
యాదాద్రి భువనగిరి
బుధవారం । 6 । సెప్టెంబర్ । 2023



చేనేతను విస్మరిస్తున్న ప్రభుత్వం
కేంద్ర ప్రభుత్వం చేనేత రంగాన్ని పూర్తిగా విస్మరిస్తోందని మాజీ ఎమ్మెల్సీ చెరువల్లి సీతారాములు ఆరోపించారు. -10లో



అధికారంలోకి తేవాలి
కాంగ్రెస్‌ను అధికారంలోకి తేవాలని ఆ పార్టీ నల్లగొండ, భువనగిరి పార్లమెంట్ మహిళా కో–ఆర్డినేటర్లు కోరారు. -10లో



బీసీలకు టికెట్లు ఇవ్వకుంటే..
బీసీలకు టికెట్లు ఇవ్వని పార్టీలు భారీ మూల్యం చెల్లించుకోక తప్పదని జాజుల శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. -10లో

శ్రీకృష్ణ, గోపికల ఫొటోలకు 'సాక్షి' ఆహ్వానం



శ్రీకృష్ణాష్టమి సందర్భంగా.. మీ చిన్నారులను కృష్ణుడి, గోపికల వేష ధారణలో అందంగా ముస్తాబు చేసి ఆ ఫొటోలను మాకు పంపండి. 7వ తేదీ సంచికలో మీ చిన్నారుల ఫొటోలను ప్రచురిస్తాం. మీ చిన్నారుల వయసు పది సంవత్సరాల లోపు ఉండాలి. గత సంవత్సరం ఫొటోలు పంపవద్దు. ఇప్పుడు అలంకరించి తీసిన ఫొటోలనే పంపాలి. మీ చిన్నారుల పేరు, గ్రామం, మండలం, పట్టణం తప్పనిసరిగా పేర్కొనాలి.

ఫొటోలు పంపాల్సిన వాట్సప్ నెంబర్
80962 93702

● రాష్ట్ర స్థాయి ఉత్తమ ఉపాధ్యాయులు, అధ్యాపకులకు అవార్డులు



హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో జరిగిన కార్యక్రమంలో విద్యాశాఖ మంత్రి సబితాఇంద్రారెడ్డి నుంచి అవార్డు అందుకుంటున్న రామన్నపేట గురుకుల పాఠశాల టీజీటీ ఎస్.జీవన్‌లత



దామెర శ్రీనివాసులు, జీహెచ్‌ఎం, జెడ్పీహెచ్‌ఎస్ నూతనకల్



తగరం అరుణశ్రీ, జీహెచ్‌ఎం, జెడ్పీహెచ్‌ఎస్ తిప్పర్తి



మారం పవిత్ర, స్కూల్‌అసిస్టెంట్, జెడ్పీహెచ్‌ఎస్ గడ్డిపల్లి, గరిడేపల్లి



ఆర్. నర్సింహారెడ్డి, స్కూల్‌అసిస్టెంట్, జెడీఎస్ మాధవనగర్, నల్లగొండ



సీహెచ్.వెంకటరామ నర్సమ్మ, ఎల్‌ఎఫ్‌ఎల్ హెచ్‌ఎం, వెంపటి



కె.నాగయ్య, ఎస్‌జీటీ, ప్రాథమిక పాఠశాల గోరంట్ల, మద్దిరాల



బి.జయరాజ్, స్కూల్‌అసిస్టెంట్, జెడ్పీహెచ్‌ఎస్ చౌటుప్పల్



కె.హర్షవర్దన్‌రెడ్డి, ఎస్‌జీటీ, తాళ్లసింగారం, చౌటుప్పల్



ప్రొఫెసర్ అలువాల రవి, మహాత్మాగాంధీ యూనివర్సిటీ



ఎ.శ్రీనివాసులు, అసోసియేట్ ప్రొఫెసర్ ఎన్జీ కాలేజీ, నల్లగొండ



డాక్టర్ ఎన్.దీపిక, అసిస్టెంట్ ప్రొఫెసర్, ఎన్జీ కాలేజీ, నల్లగొండ



సీహెచ్. సత్యనారాయణ, అసిస్టెంట్ ప్రొఫెసర్, ప్రభుత్వ డిగ్రీ కళాశాల, ఆలేరు

న్యూస్‌రీల్

ముగిసిన దరఖాస్తుల స్వీకరణ గడువు

భువనగిరి: ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతుల కోసం ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకునే గడువు మంగళవారం ముగిసింది. జిల్లా వ్యాప్తంగా సుమారు 2వేలకు పైగా ఉపాధ్యాయులు దరఖాస్తులు చేసుకున్నట్లు సమాచారం . రీ షెడ్యూల్ ప్రకారం దరఖాస్తులు చేసుకున్న వారి పత్రాలను బుధవారం పరిశీలించనున్నారు. ఇందుకోసం జిల్లా విద్యాశాఖ అధికారులు ఏడు బృందాలను ఏర్పాటు చేశారు. ఒక్కో బృందంలో ముగ్గురు చొప్పున సభ్యులను నియమించారు.

ఎన్‌హెచ్‌ఎం స్కీం ఉద్యోగులపై వివక్ష తగదు

భువనగిరిటౌన్: నేషనల్ హెల్త్ మిషన్ స్కీంలో పనిచేస్తున్న ఆల్ క్యాడర్స్ ఉద్యోగులపై రాష్ట్ర ప్రభుత్వం వివక్ష తగదని, పర్మినెంట్ చేసేంత వరకూ వారి పోరాటానికి సీపీఐ అండగా ఉంటుందని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి గోద శ్రీరాములు అన్నారు. కలెక్టరేట్ ఎదుట ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగులు చేపట్టిన సమ్మెకు మంగళవారం ఆయన మద్దతు ప్రకటించారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు గోరెటి రాములు ఎండీ ఇమ్రాన్, కార్యవర్గ సభ్యులు సామల శోభన్ బాబు, కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఎంప్లాయీస్ యూనియన్ నాయకులు కామ్రాన్, వినోద్, దుర్గ, సౌజన్య, మధు, శ్రీదేవి, రమేష్, సరిత, భార్గవి, శిరీష, ఉదయశ్రీ పాల్గొన్నారు.

ఉత్సవాలను ప్రశాంతంగా నిర్వహించుకోవాలి



మాట్లాడుతున్న ఏసీపీ వెంకట్‌రెడ్డి

భువనగిరి: ఈ నెల 19 నుంచి 27 వరకు జరగనున్న గణేష్ నవరాత్రి ఉత్సవాలను ప్రశాంతంగా నిర్వహించుకోవాలని ఏసీపీ సాయిరెడ్డి వెంకట్‌రెడ్డి సూచించారు. మంగళవారం భువనగిరిలోని రావి భద్రాద్రి ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉత్సవాలను శాంతియుత వాతావరణంలో నిర్వహించుకునేలా ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. ఈ నెల 27న జరిగే వినాయక నిమజ్జనం ప్రశాంతంగా ముగించుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో భువనగిరి గణేష్ ఉత్సవ సమితి అధ్యక్షుడు పట్నం కపిల్, పట్టణ సీఐ సుధీర్ కృష్ణ, అర్జునయ్య, ఇరిగేషన్ అధికారులు రాఘవేందర్, నరేష్, అధికారులు ప్రసాద్‌అనంతరెడ్డి, ఉత్సవ సమితి సభ్యులు ఆకుల మహేందర్, కృష్ణాచారి, రమేష్, ఉషా కిరణ్, శ్రీనివాస్, కొండల్, రాజు, ఆనంద్, శ్రీశైలం, మల్లేష్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన పోల్ క్లైంబింగ్ పరీక్షలు

భువనగిరి: ట్రాన్స్‌కో జేఎల్‌ఎంలకు పోల్ క్లైంబింగ్ పరీక్షలు మంగళవారం ముగిసాయి. జిల్లాలో 90 జేఎల్‌ఎం పోస్టులకు 183 మంది అభ్యర్థులు పోల్ క్లైంబింగ్‌కు అర్హత సాధించారు. భువనగిరిలోని విద్యుత్ డీఈ కార్యాలయం ఆవరణంలో ఈ పరీక్షలు ఏర్పాటు చేశారు. రెండో రోజు మంగళవారం 91 మంది హాజరు కావల్సి ఉండగా 85 మంది హాజరయ్యారు. ఆరుగురు గైర్హాజరయ్యారు. కార్యక్రమంలో సీజేఎం పాండ్య, కన్వీనర్ నల్లగొండ ఎస్ఈ చంద్రమోహన్, టెక్నికల్ డీఈలు రవిప్రసాద్, డాలినాయుడు శర్మ, రవీంద్రనాథ్, ఎస్ఈ శ్రీనాథ్, డీఈ మల్లికార్జున్ పాల్గొన్నారు.

దరఖాస్తు చేసుకోండి!

కమలం.. కొత్త సంప్రదాయం
- ఆశావహులు నుంచి బీజేపీ దరఖాస్తుల ఆహ్వానం
- 4వ తేదీ నుంచి మొదలైన స్వీకరణ
- దరఖాస్తు ఫారంతోనే పూర్తి సమాచారం
- నేడు దరఖాస్తు చేసుకోనున్న యాదాద్రి జిల్లా నాయకులు



సాక్షి, యాదాద్రి : ఎమ్మెల్యే టికెట్ ఆశిస్తున్న వారు దరఖాస్తు చేసుకోవాలన్న కొత్త సంప్రదాయం కమలనాథుల్లో ఆసక్తి కలిగిస్తోంది. జిల్లాలోని అన్ని నియోజకవర్గాల నుంచి నలుగురైదుగురు నాయకులు టికెట్ ఆశిస్తున్నారు. వీరంతా పార్టీ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవడానికి సిద్ధమవుతున్నారు. ఈ నెల 4వ తేదీ నుంచి నాంపల్లిలోని పార్టీ రాష్ట్ర కార్యాలయంలో మొదలైన దరఖాస్తుల స్వీకరణ 10వ తేదీ వరకు కొనసాగనుంది. మొదటి రోజు యాదాద్రి జిల్లా నుంచి ఎవరూ దరఖాస్తు చేసుకోలేదు. బీజేపీ నుంచి పోటీ చేయడానికి ఆసక్తి ఉన్న వారు తమ పూర్తి వివరాలను తెలియజేయాల్సి ఉంది. ఇందు కోసం దరఖాస్తులో పూర్తి చిరునామాతోపాటు కులం , ఉపకులం, పార్టీ లో ఎప్పు డు సభ్యత్వం తీసుకున్నారు. రాజకీయ కార్యక్రమాల వివరాలు తీసుకుంటున్నారు. అలాగే గత ఎన్నికల్లో ఎంపీ, ఎమ్మెల్యేగా, స్థానిక సంస్థల్లో పోటీచేస్తే ఆ వివరాలు, పార్టీలో ప్రస్తుత బాధ్యతలు ఏమి నిర్వహిస్తున్నారు.. వాటి పూర్తి వివరాలను తీసుకుంటున్నారు.

నేరచరిత్రపై కూడా..

టికెట్ దరఖాస్తు ఫాంలోనే ఆశావహులు తమ నేరచరిత్ర వివరాలను తెలియజేయాల్సి ఉంది. క్రిమినల్, సివిల్ కేసులు.. వాటి వివరాలు సమగ్రంగా తీసుకుంటున్నారు. వీటితోపాటు ఏమైన శిక్షలు పడితే వాటి వివరాలు పూర్తిగా కేసు ఫైల్ నెంబర్‌తో సహా తెలుపాలని దరఖాస్తు ఫాంలో పొందుపరిచారు.

నేడు దరఖాస్తు చేయనున్న ఆశావహులు

భువనగిరి, ఆలేరు, తుంగతుర్తి, మునుగోడు, నకిరేకల్ నియోజకవర్గాల నుంచి బీజేపీ ఆశావహుల్లో పలువురు బుధవారం దరఖాస్తు చేసుకోనున్నారు. ఎలాంటి హంగూ ఆర్భాటం లేకుండా పార్టీ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని బీజేపీ నాయకత్వం ఇప్పటికే అంతర్గత సంకేతాలిచ్చింది. ముహూర్త బలం చూసుకుని దరఖాస్తు చేసుకునే ఆలోచనలో ఆశావహులు ఉన్నారు.

అందరి చూపు రాజగోపాల్‌రెడ్డి పైనే..

మాజీ ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి దరఖాస్తుపైనే అందరి దృష్టి నెలకొంది. మునుగోడు నుంచి కాంగ్రెస్ ఎమ్మెల్యేగా గెలిచిన ఆయన అనంతరం రాజీనామా చేసి బీజేపీలో చేరారు. మునుగోడు ఉప ఎన్నికలో బీజేపీ తరపున పోటీ చేసి స్వల్ప తేడాతో ఓడిపోయారు. అయితే ఈ సారి మునుగోడు నుంచి పోటీచేస్తారా లేక మరో స్థానం నుంచి పోటీలో దిగుతారా అనే విషయంపై ఆసక్తి నెలకొంది. 2009లో భువనగిరి పార్లమెంట్ సభ్యుడిగా గెలిచిన ఆయన ఈ సారి ఎక్కడ నుంచి పోటీ చేస్తారనేది టికెట్ కోసం దరఖాస్తు చేసుకోవడంతోనే తేలిపోనుందని పరిశీలకులు అంటున్నారు.

అర్హులందరికీ ఓటు హక్కు కల్పించాలి

● అదనపు కలెక్టర్ వీరారెడ్డి



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ వీరారెడ్డి

యాదగిరిగుట్ట రూరల్: అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించాలని అదనపు కలెక్టర్ వీరారెడ్డి బూత్ లెవల్ అధికారులను ఆదేశించారు. మంగళవారం యాదగిరిగుట్ట తహసీల్దార్ కార్యాలయాన్ని ఆయన సందర్శించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ ఇంటింటి సర్వే నిర్వహించే క్రమంలో ఓటరు నమోదు, మార్పులు, చేర్పులకు సంబంధించిన దరఖాస్తు ఫారాలను వెంట ఉంచుకోవాలని సూచించారు. ఓటరు జాబితాల్లో పేర్లు తొలగించే విషయంలో ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. మరణించిన వారి మరణ ధ్రువీకరణ పత్రాన్ని కుటుంబ సభ్యుల నుంచి సేకరించి పరిశీలించాలని తెలిపారు. ప్రతి ఇంటికీ వెళ్లి ఓటరు జాబితాలో పేర్లు లేని వారిని గుర్తించాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ వెంకటేశ్వర్లు, డిప్యూటీ తహసీల్దార్ నర్సింగరావు, సీనియర్ అసిస్టెంట్ రవీందర్‌రెడ్డి, ఆర్ఐ విజయ సింహారెడ్డి, నరేష్, రమేష్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

ఆంజనేయస్వామికి ఆకుపూజ



ఆంజనేయస్వామికి హారతినిస్తున్న అర్చకుడు

యాదగిరిగుట్ట: యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి వారి దేవాలయంలో మంగళవారం సంప్రదాయ పూజలు కొనసాగాయి. క్షేత్రపాలకుడిగా కొనసాగుతున్న ఆంజనేయస్వామికి అర్చకులు ఆకుపూజ నిర్వహించారు. అంజనీ పుత్రుడిని సింధూరంతో అభిషేకించి, తమలపాకులతో అర్చించారు. ఇక ప్రధానాలయంలో ఉదయం నుంచి సాయంత్రం వరకు సంప్రదాయ పూజలు కొనసాగాయి. సుప్రభాతం, అభిషేకం, అర్చన, శ్రీసుదర్శన నారసింహ హోమం, గజవాహన సేవ, నిత్య కల్యాణం, బ్రహ్మోత్సవం, జోడు సేవలు విశేషంగా జరిపించారు. ముఖ మండపంలో సువర్ణ పుష్పార్చన మూర్తులకు అష్టోత్తర పూజలు నిర్వహించారు.

ఉప్పొంగిన మూసీ

- జిల్లా అంతటా వర్షం
- అత్యధికంగా యాదగిరిగుట్టలో 59.4, అత్యల్పంగా అడ్డగూడూరులో 0.6 మి.మీ వర్షపాతం నమోదు



అలుగుపోస్తున్న పోచంపల్లి చెరువు

భువనగిరిటౌన్, భూదాన్‌పోచంపల్లి, రాజాపేట: అల్పపీడన ప్రభావంతో కురుస్తున్న వర్షాలకు మూసీ ఉప్పొంగి ప్రవహిస్తోంది. హైదరాబాద్‌లో కురిసిన వర్షాలకు మంగళవారం ఉదయం నుంచి మండలంలోని జూలూరు, శివారెడ్డిగూడెం వద్ద లోలెవల్ బ్రిడ్జిపై నుంచి మూసీ ప్రవహించింది. పోచంపల్లి నుంచి బీబీనగర్‌కు, శివారెడ్డిగూడెం నుంచి దంతూర్, వంకమామిడి గ్రామాలకు వాహనాలు వెళ్లకుండా అధికారులు ముళ్లకంచె, బారికేడ్లు ఏర్పాటు చేశారు. తహసీల్దార్ వీరాబాయి, సీఐ మహేశ్, ఎస్ఐ విక్రమ్‌రెడ్డి మూసీని పరిశీలించారు. అదేవిధంగా మండలంలోని మూసీ ఆధారిత చెరువులు, కుంటలు నిండి జలకళను సంతరించుకున్నాయి. పోచంపల్లి చెరువు నిండి అలుగుపోస్తుంది. కాగా.. గత రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు రాజాపేట మండలంలోని దూదివెంకటాపురం, కాల్వపల్లి, పారుపల్లి తదతర గ్రామాల్లో పత్తిచేలు నీటమునిగాయి. వలిగొండ మండలంలోని సంగం వద్ద మూసీ నది వంతెనపై నుంచి నీరు ఉధృతంగా ప్రవహిస్తోంది. స్థానిక తహసీల్దార్ శ్రీనివాస్‌రెడ్డి, ఎస్సై ప్రభాకర్ వరద ఉధృతిని పరిశీలించారు. కాగా.. అత్యధికంగా యాదగిరిగుట్టలో 59.4 మిల్లీ మీటర్లు, బొమ్మలరామారం మండలంలో 52.4 మిల్లీమీటర్లు, రాజాపేటలో 49.4, తుర్కపల్లిలో 45.4, భువనగిరిలో 45.4, భూదాన్‌పోచంపల్లిలో 38.4, అడ్డగూడూరులో 0.6 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైయినట్లు అధికారులు తెలిపారు.



జూలూరు వద్ద కొనసాగుతున్న మూసీ వరద ప్రవాహం

ఉపాధ్యాయులతో అత్యుత్తమ సమాజ నిర్మాణం

● ప్రభుత్వ విప్ గొంగిడి సునీత



డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాల వేస్తున్న ప్రభుత్వ విప్ గొంగిడి సునీత



నృత్యాలు చేస్తున్న విద్యార్థినులు

సాక్షి, యాదాద్రి: ఉపాధ్యాయుల వల్లే అత్యుత్తమ సమాజ నిర్మాణం సాధ్యమవుతుందని ప్రభుత్వ విప్ గొంగిడి సునీత అన్నారు. మంగళవారం సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిని పురస్కరించుకుని కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో గురుపూజోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఎవరు ఎంతటి ఉన్నత స్థాయిలో ఉన్నా గురువే ప్రధాన కారణమన్నారు. పిల్లల భవిష్యత్‌ను తీర్చిదిద్దే గురుతర బాధ్యత గురువులపైనే ఉందని తెలిపారు. ప్రస్తుతం కొన్ని చోట్ల విద్యార్థుల్లో చెడు అలవాట్లు వెలుగు చూస్తున్నాయని, ఉపాధ్యాయులు వాటిని మొగ్గలోనే తుంచి వేసే సామాజిక బాధ్యత తీసుకోవాలన్నారు. కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం తొలిమెట్టు ద్వారా ప్రాథమిక విద్యార్థులకు విద్యా ప్రమాణాలు మెరుగుపరిచే దిశగా ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. విద్యార్థులతో సబ్జెక్టు బుక్స్ చదివించాలని, లైబ్రరీ పీరియడ్స్ ఏర్పాటు చేయాలని సూచించారు. మనఊరు – మనబడి పనులకు సంబంధించిన బిల్లులు త్వరగా మంజూరయ్యేలా చూస్తామని తెలిపారు. టీఎల్‌ఎం ఆవిష్కరణలను అదే పాఠశాలలోనే కాకుండా మిగతా పాఠశాలలో కూడా ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకోవాలని జిల్లా విద్యాశాఖ అధికారికి సూచించారు. అదనపు కలెక్టర్ వీరారెడ్డి మాట్లాడుతూ ప్రస్తుతం టెక్నాలజీ పెరిగినందున విద్యార్థులకు ఇంకా మెరుగైన రీతిలో బోధన చేసి మంచి ఫలితాలు సాధించాలని కోరారు. అనంతరం 31 మంది జిల్లా ఉత్తమ ఉపాధ్యాయులను సన్మానించారు. కార్యక్రమంలో భువనగిరి ఎంపీపీ నరాల నిర్మల, జెడ్పీటీసీ సభ్యులు సుబ్బూరు బీరు మల్లయ్య, జిల్లా విద్యాశాఖ అధికారి నారాయణరెడ్డి, ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులు, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, అధికారులు పాల్గొన్నారు.

విద్యాశాఖలో విలీనం చేయాలి



బోనాలు ఎత్తుకుని నిరసన తెలుపుతున్న సమగ్ర శిక్ష ఉద్యోగులు

భువనగిరిటౌన్: సమగ్ర శిక్ష ఉద్యోగులను విద్యాశాఖలో విలీనం చేసి క్రమబద్ధీకరించాలని కోరుతూ చేపట్టిన రిలే నిరాహార దీక్షలో భాగంగా మంగళవారం ఆటపాటలతో మైసమ్మకు బోనం సమర్పించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా జేఏసీ అధ్యక్షుడు మంగ పాండరి మాట్లాడుతూ గత 16 సంవత్సరాల నుంచి చాలీచాలని వేతనాలతో దుర్భర జీవితం గడుపుతున్న సమగ్ర శిక్ష ఉద్యోగులకు ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. మహిళా ఉద్యోగులకు 180 రోజులు వేతనంతో కూడిన ప్రసూతి సెలవులు ఇవ్వాలన్నారు. విధి నిర్వహణలో చనిపోయిన ఉద్యోగులకు రూ.15 లక్షలు ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని డిమాండ్ చేశారు. హెల్త్ ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలని ప్రభుత్వాన్ని కోరారు.

స్వరాష్ట్రంలోనే ఉద్యోగులకు గుర్తింపు

యాదగిరిగుట్ట: తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు తరువాతనే ప్రభుత్వ ఉద్యోగులకు మంచి గుర్తింపు రావడంతో పాటు విలువలు పెరిగాయని ప్రభుత్వ విప్ గొంగిడి సునీత అన్నారు. యాదగిరిగుట్ట పట్టణంలో మంగళవారం జూనియర్ పంచాయతీ కార్యదర్శులకు గ్రేడ్- 4 కార్యదర్శులుగా నియామకపత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నియోజకవర్గ వ్యాప్తంగా 59మంది జూనియర్ పంచాయతీ కార్యదర్శులకు గ్రేడ్-4 కార్యదర్శులుగా నియామక ఉత్తర్వులు అందజేసినట్లు తెలిపారు. సీఎం కేసీఆర్ ప్రభుత్వ ఉద్యోగులకు అన్ని రకాల సౌకర్యాలను కల్పిస్తున్నారన్నారు. పల్లె ప్రగతితో పాటు గ్రామాల అభివృద్ధిలో పంచాయతీ కార్యదర్శులు కీలకంగా పని చేశారని గుర్తు చేశారు. గ్రామాల అభివృద్ధిలో ప్రజాప్రతినిధులు, ప్రజలతో పాటు పంచాయతీ కార్యదర్శులు పాలుపంచుకోవడం వారి అదృష్టంగా భావించాలన్నారు. గ్రేడ్-4 కార్యదర్శులుగా నియామక పత్రాలు అందుకున్న వారికి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ వీరారెడ్డి, డీపీఓ సునంద, డీఎల్‌పీఓ యాదగిరి, గుట్ట ఎంపీడీఓ ప్రభాకర్‌రెడ్డి, ఎంపీడీఓలు, ఎంపీఓలు పాల్గొన్నారు.



గ్రేడ్-4 కార్యదర్శులుగా నియామకపత్రాలు అందుకున్న జూనియర్ పంచాయతీ కార్యదర్శులు

భువనగిరికి రూ.9.80 కోట్లు మంజూరు

భువనగిరి: భువనగిరి నియోజకవర్గంలో అభివృద్ధి పనులకు ట్రైబల్ వెల్ఫేర్ డిపార్ట్‌మెంట్ ద్వారా రూ.9.80 కోట్లు మంజూరయ్యాయి. గిరిజన సంక్షేమ శాఖ(ఎస్‌టీఎస్‌డీఎఫ్) ద్వారా మంజూరైన నిధులను భువనగిరి మండలంలోని సూరేపల్లి నుంచి పీబీ తండా మీదుగా చందుగాని తండాకు వరకు 4.50 కిలోమీటర్ల బీటీ రోడ్డుకు రూ.3.15 కోట్లు, బీబీనగర్ మండలంలో గొల్లగూడెం నుంచి నీలంబావి మీదుగా అనాజీపురం వరకు 3కిలోమీటర్ల మేర బీటీ రోడ్డు నిర్మాణానికి రూ.2.10 కోట్లు, చిన్నరావులపల్లి నుంచి సీనాతండా వరకు బీటీ రోడ్డుకు రూ. 2.10 కోట్లు, రామునిగుండ్ల తండా నుంచి శ్మశాన వాటిక మీదుగా ముగ్దుంపల్లి వరకు బీటీరోడ్డుకు రూ.2.45 కోట్లను కేటాయించారు. నిధుల మంజూరు పట్ల ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డి సీఎం కేసీఆర్, మంత్రులు కేటీఆర్, సత్యవతి రాథోడ్, జగదీష్‌రెడ్డిలకు కృతజ్ఞతలు తెలిపారు.

క్లుప్తంగా

భూకబ్జాకు యత్నించిన వ్యక్తిపై కేసు నమోదు

భూదాన్‌పోచంపల్లి: మున్సిపాలిటీ పరిధిలోని శ్రీమిత్ర టౌన్‌షిప్‌లో మున్సిపాలిటీకి చెందిన భూమిని చదును చేస్తూ కబ్జాకు యత్నించిన వ్యక్తిపై మంగళవారం కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ విక్రమ్‌రెడ్డి తెలిపారు. ఎస్‌ఐ, మున్సిపల్ కమిషనర్ కె. నర్సింహారెడ్డి తెలిపిన వివరాల ప్రకారం. పోచంపల్లి మున్సిపాలిటీ పరిధిలోని శ్రీమిత్ర టౌన్‌షిప్‌లో గల సర్వే నంబర్లు 621, 622, 623, 634, 636, 638, 639, 642, 643, 645, 686, 688, 689, 690, 691, 695, 699లలో మున్సిపల్ కార్యాలయానికి కేటాయించిన 2.02 ఎకరాల భూమి(10శాతం ఖాళీ స్థలం)ని బద్దం భాస్కర్‌రెడ్డి అనే వ్యక్తి జేసీబీతో చదును చేస్తూ కబ్జాకు యత్నించాడని మున్సిపల్ కమిషనర్ మంగళవారం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు భాస్కర్‌రెడ్డిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు. ఎవరైనా మున్సిపల్ స్థలం కబ్జా చేస్తే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని మున్సిపల్ కమిషనర్ హెచ్చరించారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి


ఉప్పలయ్య (ఫైల్)

నూతనకల్: మండల పరిధిలోని ఎర్రపహాడ్ గ్రామంలో తన పెద్ద నాన్న కుటుంబ సభ్యుల దాడిలో గాయపడిన వ్యక్తి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం మృతిచెందాడు. ఎస్‌ఐ నరేష్ తెలిపిన వివరాల ప్రకారం.. ఎర్రపహాడ్ గ్రామానికి చెందిన లింగాల అంజయ్య, అతడి అన్న లింగాల వెంకటయ్య మధ్య కొంతకాలంగా భూవివాదం నడుస్తోంది. అంజయ్య పెద్ద కుమారుడు లింగాల ఉప్పలయ్య (40) బతుకుదెరువు నిమిత్తం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం కృష్ణా జిల్లా వత్సవాయి మండలానికి వెళ్లి గీత కార్మికుడిగా జీవనోపాధి పొందుతున్నాడు. ఎర్రపహాడ్ గ్రామంలో నూతనంగా నిర్మించిన ముత్యాలమ్మ గుడి విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలలో పాల్గొనేందుకు ఈ నెల 27న ఉప్పలయ్య సొంత గ్రామానికి వచ్చాడు. అదే రోజు ముత్యాలమ్మ తల్లిని దర్శించుకునేందుకు వెళ్లిన సమయంలో లింగాల వెంకటయ్య కుటుంబ సభ్యులు ఉప్పలయ్య కళ్లలో కారం చల్లి దాడికి పాల్పడ్డారు. ఈ దాడిలో ఉప్పలయ్య తలకు తీవ్రంగా గాయాలయ్యాయి. గాయపడిన ఉప్పలయ్యను అతడి కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం హైదరాబాద్‌లోని కామినేని ఆస్పత్రికి తరలించగా.. చికిత్స పొందుతూ మంగళవారం మృతిచెందాడు. మృతుడికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు.

యువతి అదృశ్యం.. కేసు నమోదు


ఎర్రం శివాని

రామన్నపేట: మండలంలోని ఇంద్రపాలనగరం గ్రామానికి చెందిన యువతి అదృశ్యమైంది. ఎస్‌ఐ లక్ష్మయ్య తెలిపిన వివరాల ప్రకారం.. ఇంద్రపాలనగరం గ్రామానికి చెందిన ఎర్రం మంజుల కుమార్తె ఎర్రం శివాని ఫిజియోథెరపిస్ట్‌గా పనిచేస్తుంది. ఈ నెల 4వ తేదీన శివాని కళాశాలకు వెళ్తున్నానని చెప్పి ఇంట్లో నుంచి వెళ్లిన శివాని సాయంత్రం అయినా తిరిగి రాలేదు. ఆమె కోసం ఎంత వెతికినా ఆచూకీ లభించకపోవడంతో తల్లి మంజుల మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ లక్ష్మయ్య తెలిపారు.

ఉత్తమ గురువులకు అవార్డులు


జిల్లా స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు అందుకుంటున్న సుమిత్ర, ప్రధానోపాధ్యాయురాలు, బాలికల జెడ్పీహెచ్ఎస్, నారాయణపూర్


ఉషారాణి, ప్రధానోపాధ్యాయురాలు, పుట్టపాక | బాలలక్ష్మి, ఎస్ఏ, దత్తాయిపల్లి | ప్రభాకర్‌రెడ్డి,ఎస్ఏ, మోటకొండూర్ | శ్రీధర్, ఎస్ఏ, భువనగిరి | యాదగిరి, ఎస్ఏ, వెల్మజాల


రామకృష్ణారెడ్డి, ఎస్ఏ, అనంతారం | రవికుమార్, ఎస్ఏ, తాండూర్ | అయేషా సుల్తానా, ఎస్ఏ, భువనగిరి | విజయ, ఎస్ఏ, పుట్టపాక | భాగ్యశ్రీ, ఎస్ఏ, వలిగొండ | నవీన్, పీజీటీ, రామారం | రవికాంత్, ఎస్‌జీటీ, మోటకొండూర్ | కరుణాకర్, ఎస్‌జీటీ, మొరిపిరాల


రమేష్ ఎస్‌జీటీ, వెల్వర్తి | కమలాకర్‌రెడ్డి, ఎస్‌జీటీ, పీపల్‌పహాడ్ | వెంకటేశ్వర్లు, ఎస్‌జీటీ, గద్దరాలతండా | రామచంద్రు, ఎస్‌జీటీ, చీమలకొండూర్ | మల్లారెడ్డి, ఎస్‌జీటీ, ఇస్కిళ్ల | వెంకటనర్సింహారెడ్డి, ఎస్‌జీటీ, సుంకిశాల | ఆదిలక్ష్మి, ఎస్‌జీటీ, రామలింగంపల్లి | ధనలక్ష్మి, ఎస్‌జీటీ, జియాపల్లి


శ్రీదేవి, ఎస్‌జీటీ, రాయిరావుపేట | లక్ష్మారెడ్డి, ఎస్‌జీటీ, పెద్దకాపర్తి | భూపాల్‌రెడ్డి, ఎస్‌జీటీ, జైకేసారం | యాదయ్య, ఎస్‌జీటీ, కంకణాలగూడెం | చిత్తరంజన్, ఎస్‌జీటీ, రాయిపల్లి | జయశ్రీ, లాంగ్వేజ్ పండిట్, కప్రాయిపల్లి | జైనులాబ్దీన్, లాంగ్వేజ్ పండిట్, ముల్కలపల్లి | కోటేశ్వర్‌రావు, పీఈటీ, చల్లూరు | శ్రీలత, సీఆర్‌టీ, బొమ్మలరామారం

స్వాతంత్య్ర సమర యోధులకు సన్మానం


స్వాతంత్య్ర సమరయోధులను సన్మానిస్తున్న జిల్లా అధ్యక్షుడు పీవీ శ్యామ్‌సుందర్‌రావు

ఆలేరురూరల్: స్వాతంత్య్రం వచ్చి 75 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా దేశం కోసం అమరులైన వారిని గుర్తు చేసుకుంటూ ప్రధాని నరేంద్ర మోదీ మేరీ మాటి మేరా దేశ్ కార్యక్రమాన్ని చేపట్టారని బీజేపీ జిల్లా అధ్యక్షుడు పీవీ శ్యామ్‌సుందర్ రావు అన్నారు. ఈమేరకు మంగళవారం ఆలేరు పట్టణ కేంద్రంలో స్వాతంత్య్ర సమరయోధులను సన్మానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఢిల్లీలో అమరవీరుల స్మృతి వనం, అమృత వాటిక నిర్మాణానికి దేశ ప్రజలందరూ భాగస్వాములు కావాలనే ఉద్దేశంతో ప్రతి ఇంటి నుంచి మట్టిని సేకరిస్తున్నట్లు తెలిపారు. పార్టీ అసెంబ్లీ నియోజకవర్గ కన్వీనర్ చిరిగె శ్రీనివాస్, పట్టణ అధ్యక్షుడు బడుగు జహంగీర్, జిల్లా కార్యదర్శి సముద్రాల కల్పన, ఐడియా శ్రీను, పస్తం ఆంజనేయులు, పగడాల శ్రీనివాస్, మహేష్, నందం, భాస్కర్, చింతకింది కీర్తి, వనజ పాల్గొన్నారు.

యాదాద్రీశుడిని దర్శించుకున్న ఎమ్మెల్యేలు


నర్సాపూర్ ఎమ్మెల్యే మదన్‌రెడ్డికి ఆశీర్వచనం చేస్తున్న ఆచార్యులు


మంత్రాలయం ఎమ్మెల్యే వై. బాలనాగిరెడ్డికి లడ్డూ ప్రసాదం అందజేస్తున్న ఆలయ అధికారి

యాదగిరిగుట్ట: యాదాద్రీశుడిని నర్సాపూర్ ఎమ్మెల్యే చిలుముల మదన్‌రెడ్డి, ఆంధ్రప్రదేశ్‌లోని మంత్రాలయం ఎమ్మెల్యే వై. బాలనాగిరెడ్డి మంగళవారం వేర్వేరుగా దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు వారికి సంప్రదాయంగా స్వాగతం పలికారు. అనంతం గర్భాలయంలో స్వయంభూ, ప్రతిష్ఠా అలంకార మూర్తులను దర్శించుకొని, ప్రత్యేక పూజలు చేశారు. ఎమ్మెల్యేలకు ఆచార్యులు ప్రథమ ప్రాకార మండపంలో వేద ఆశీర్వచనం చేయగా, అధికారులు లడ్డూ ప్రసాదం అందజేశారు.

మిషన్ భగీరథ కార్మికులతో చర్చలు విఫలం


చర్చల్లో పాల్గొన్న కార్మిక సంఘాల నాయకులు, అధికారులు

- 10 నుంచి సమ్మెలోకి కార్మికులు

భువనగిరిటౌన్: మిషన్ భగీరథలో పనిచేస్తున్న కార్మికులకు కనీస వేతనం, ఇతర సమస్యల పరిష్కారానికి భువనగిరిలోని స్థానిక సూపరింటెండింగ్ ఇంజనీర్ (డీఈ) సమక్షంలో మంగళవారం సీఐటీయూ, ఏఐటీయూసీ యూనియన్ నాయకులకు, మేఘా కంపెనీ యాజమాన్య ప్రతినిధులకు మధ్య జరిగిన చర్చలు విఫలమయ్యాయి. యాదాద్రి భువనగిరి, నల్లగొండ, సూర్యాపేట జిల్లాల్లో 1500 మందికి పైగా కార్మికులు మిషన్ భగీరథలో పనిచేస్తున్నారు. వారికి ప్రస్తుత వేతనం జీఓ 107 ప్రకారం రూ.10వేలలోపు మాత్రమే అమలు అవుతోంది. ప్రాజెక్టుల నిర్మాణ సమయంలో అమలయ్యే 107 జీఓను అమలు చేయడం సరైంది కాదని, పెరిగిన ధరలకనుగుణంగా జీఓ 60 ప్రకారం కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని యూనియన్ నాయకులు, కార్మికులు కోరారు. కాగా.. యాజమాన్యాలు వేతనం పెంచడానికి, కనీస సేఫ్టీ మేజర్స్ ఇవ్వడానికి ముందుకు రాకపోవడంతో చర్చలు విఫలమయ్యాయి. దీంతో ఇప్పటికే సమ్మె నోటీస్ ఇచ్చామని, ఈమేరకు 10వ తేదీ నుంచి సమ్మెలోకి వెళ్తున్నట్లు కార్మిక సంఘాల నాయకులు, కార్మికులు తెలిపారు.

మహిళలు ఆర్థికంగా రాణించాలి


మాట్లాడుతున్న మహిళా సాధికారత జెండర్ స్పెషలిస్టు నిఖిత

యాదగిరిగుట్ట: మహిళలు ఆర్థికంగా రాణించాలని జిల్లా మహిళా సాధికారత జెండర్ స్పెషలిస్టు నిఖిత అన్నారు. మంగళవారం యాదగిరిగుట్ట పట్టణంలోని అంగన్‌వాడీ కేంద్రం- 1లో నిర్వహించిన బాలింతలు, గర్భిణులకు, మహిళా సాధికారతపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రస్తుత పోటీ ప్రపంచంలో మహిళలు అన్ని రంగాల్లో రాణించాలన్నారు. కానీ కొంత మంది మహిళలు వెనుకబడిపోతున్నారని, పురుషులతో సమానంగా ముందుకు సాగాలన్నారు. మహిళలు ఏదైనా అత్యవసర సమయాల్లో 181, 1098 నంబర్లకు కాల్ చేయవచ్చని తెలిపారు. అనంతరం అంగన్‌వాడీలోని చిన్నారుల పేరున మొక్కలు నాటించారు. కార్యక్రమంలో 4వ వార్డు కౌన్సిలర్ సీస విజయలక్ష్మి కృష్ణగౌడ్, మహిళా సాధికారత అధికారి మనిషా, అంగన్‌వాడీ టీచర్ శోభారాణి, గర్భిణులు, బాలింతలు పాల్గొన్నారు.

ఏడుగురు జూదరుల అరెస్ట్

భువనగిరి: మండల పరిధిలోని నందనం గ్రామంలో మంగళవారం పేకాట స్థావరంపై పోలీసులు దాడి చేసి ఏడుగురిని అదుపులోకి తీసుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నందనం గ్రామ శివారులోని ఓ వెంచర్‌లో కొందరు వ్యక్తులు పేకాట ఆడుతున్న సమాచారం అందడంతో భువనగిరి ఎస్‌ఓటీ, భువనగిరి రూరల్ పోలీసులు దాడి చేసి ఏడుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి రూ.13,200 నగదు, 7 సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ సంతోష్‌కుమార్ తెలిపారు.

ప్రభుత్వ పథకాలపై పరిశీలన

- యాదాద్రి కలెక్టరేట్‌కు వచ్చిన వివిధ రాష్ట్రాల అధికారులు


యాదాద్రి కలెక్టరేట్‌లో వివిధ రాష్ట్రాల అధికారులు

సాక్షి, యాదాద్రి: భారత్ దర్శన్ కార్యక్రమంలో భాగంగా రాజస్థాన్, ఉత్తరప్రదేశ్, పశ్చిమబెంగాల్, మధ్యప్రదేశ్, హర్యానా, ఛత్తీస్‌ఘడ్ రాష్ట్రాల నుంచి 39 మంది కేంద్ర ప్రభుత్వ అధికారుల బృందం మంగళవారం యాదాద్రి భువనగిరి జిల్లాకు వచ్చింది. బృందం సభ్యులు కలెక్టరేట్‌ను సందర్శించి పలు విభాగాలను పరిశీలించారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను అదనపు కలెక్టర్ భాస్కర్‌రావు వారికి వివరించారు. వ్యవసాయ భూముల రిజిస్ట్రేషన్ పారదర్శకంగా చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం ధరణి ప్రవేశపెట్టిందని చెప్పారు. ధరణి, రైతుబంధు, రైతుబీమా, మీ సేవ కేంద్రాల పనితీరును పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. దీర్ఘకాలిక భూ సమస్యల పరిష్కారం కోసం, భూ క్రయ విక్రయాలు సక్రమంగా జరిగేలా ధరణి రూపొందించబడిందన్నారు. గతంలో జరిగిన తప్పుల సవరణకు రాష్ట్ర ప్రభుత్వం అన్ని రకాల మాడ్యూల్స్ ధరణిలో పొందుపరించిందని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం రైతులకు వ్యవసాయం కోసం పెట్టుబడి సహాయం కొరకు నగదు రూపంలో అందించి రైతుకు ఆర్థిక మనో ధైర్యం కలిగించేందుకు రైతుబంధు పథకం ప్రవేశపెట్టిందని చెప్పారు. రైతు మరణిస్తే అతని కుటుంబానికి రూ. 5 లక్షలు నామినీ ఎకౌంట్లలో పది రోజులలోపు జమచేస్తుందన్నారు. సంబంధిత బీమా ప్రీమియం ప్రభుత్వమే భరిస్తుందని తెలిపారు. యాదాద్రి జిల్లాలో 71 మీ సేవ కేంద్రాలు పనిచేస్తున్నాయని, ప్రతి మండలంలో, మేజర్ గ్రామ పంచాయితీలలో ఏర్పాటు చేశామని, ఈ కేంద్రాల ద్వారా ప్రజలకు కుల, ఆదాయ, ఉద్యోగ, సదరన్, ఆధార్, సంక్షేమ పథకాలు తదితర శాఖల అనుసంధానంతో విస్తృత సేవలు అందిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి అనురాధ, కలెక్టరేట్ సూపరింటెండెంట్ నాగేశ్వరాచారి, కలెక్టరేట్ పరిపాలన అధికారి జగన్ పాల్గొన్నారు. కేంద్ర బృందం సభ్యులు అంతకుముందు యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామిని దర్శించుకున్నారు.

జానయ్యపై పెట్టిన కేసులో మంత్రిని ముద్దాయిగా చేర్చాలి

- అక్రమ కేసులతో గొంతు నొక్కలేరు
- తెలంగాణలో బహుజన విప్లవం రాబోతుంది
- ఈ విప్లవంలో కేసీఆర్ కొట్టుకుపోవడంఖాయం
- జానయ్య యాదవ్ తల్లి, కోడలును పరామర్శించిన ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్

సూర్యాపేట రూరల్: డీసీఎంఎస్ చైర్మన్ వట్టె జానయ్య యాదవ్‌పై పెట్టిన కేసుల్లో మంత్రి జగదీష్‌రెడ్డిని కూడా ముద్దాయిగా చేర్చాలని బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ డిమాండ్ చేశారు. మంగళవారం సూర్యాపేట మండలం గాంధీనగర్‌లో జానయ్య తల్లి ఐలమ్మ, కోడలు సిరిని ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ పరామర్శించారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అక్రమ కేసులతో బహుజనవాదాన్ని...బహుజన బిడ్డల గొంతులను నొక్కలేరని అన్నారు. తొమ్మిదేళ్ల తరువాత వట్టె జానయ్య బహుజన బాధితుల సంఘం ఎక్కడ నుంచి వచ్చిందో మంత్రి జగదీష్‌రెడ్డి చెప్పాలన్నారు. మంత్రి జగదీష్‌రెడ్డి ఆడుతున్న డ్రామాతో బీసీ నాయకుడు జానయ్య యాదవ్ కుటుంబం అజ్ఞాతంలో ఉందన్నారు. రాష్ట్రంలో మంత్రులు జగదీష్‌రెడ్డి, మల్లారెడ్డి, నిరంజన్‌రెడ్డి, కేటీఆర్, కవిత, హరీష్‌రావులు వందల ఎకరాల భూములను ఆక్రమించారని ఆరోపించారు. 30వేల ఎకరాల ఎస్సీ,ఎస్టీ భూములను కేసీఆర్ గుంజుకున్నారన్నారు. నాడు మాధవరెడ్డి బెల్లి లలితను చంపి శరీర భాగాలు వేరు చేశారని నేడు మంత్రి జగదీష్‌రెడ్డి జానయ్యను చంపాలని చూస్తున్నారని ఆరోపించారు. రాబోయే బహుజన విప్లవంలో కేసీఆర్ కొట్టుకుపోవడం ఖాయమన్నారు. జానయ్యపై పీడీ, గీడీ కేసులు పెడితే రాష్ట్రం అగ్ని గుండంలా మారుతుందన్నారు. బీసీ బిడ్డ జానయ్యను రక్షించుకునేందుకు ఏ పోరాటానికైనా సిద్ధమన్నారు. జానయ్యకు ఏమైనా అయితే కేసీఆర్, మంత్రి జగదీష్‌రెడ్డిలు బాధ్యత వహించాలన్నారు. నిజంగా బాధితులకు అన్యాయం జరిగితే వారికి న్యాయం చేస్తామన్నారు. మంత్రి జగదీష్‌రెడ్డి మాటలు వింటే బాధితులకు నష్టం జరుగుతుందన్నారు. మంత్రి ఆదేశాలు ఇవ్వగానే పోలీసులు అక్రమ కేసులు పెట్టి వందలాది మంది యువకులను ఇబ్బందులకు గురిచేయడం సరికాదన్నారు. దండుమల్కాపూర్‌లో మంత్రి జగదీష్‌రెడ్డి వందలాది ఎకరాలను ఆక్రమించారని ఆరోపించారు. సమావేశంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుండా ధర్మేంద్ర, రాష్ట్ర కోశాధికారి వెంకటేష్ చౌహాన్, జిల్లా అధ్యక్షుడు బుడిగ మల్లేష్ యాదవ్, దయాకర్ మోరియా, సాంబశివగౌడ్, నర్ర నిర్మల, కవిత, నాగమణి, ప్రియదర్శిని పాల్గొన్నారు.

ఇద్దరు విద్యార్థినుల ఆత్మహత్యాయత్నం

- ఆస్పత్రికి తరలింపు.. విషమంగా ఆరోగ్య పరిస్థితి
- కారణాలు తెలియరాలేదన్న పోలీసులు


శివాని



మనీష

నల్లగొండ క్రైం: డిగ్రీ చదువుతున్న ఇద్దరు విద్యార్థినులు గడ్డి మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. ఈ ఘటన నల్లగొండ పట్టణంలోని రాజీవ్ పార్కులో మంగళవారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నార్కట్‌పల్లి మండలంలోని నక్కలపల్లికి చెందిన దొంతరబోయిన శివాని, అదే మండలంలోని అమ్మనబోలు గ్రామానికి చెందిన అనుగూతల మనీష ఇంటర్మీడియట్ నుంచి స్నేహితులు.. వారు నల్లగొండ పట్టణంలోని వన్ టౌన్ పోలీస్ స్టేషన్ సమీపంలో గల ఎస్సీ హాస్టల్‌లో ఉంటూ నల్లగొండలోని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో బీఎస్సీ ద్వితీయ సంవత్సరం చదువుతున్నారు. గత 20 రోజులుగా ఇంటి వద్దనే ఉన్న వీరిద్దరు కళాశాలకు వెళ్తామని కుటుంబ సభ్యులకు చెప్పి మంగళవారం ఉదయం బస్సులో నల్లగొండకు వచ్చారు. అనంతరం ఎన్జీ కళాశాల వెనుక ఉన్న రాజీవ్ పార్కులోకి ఇద్దరూ వెళ్లి గడ్డి మందు తాగి పార్కు గేట్ వద్దకు వచ్చి బిగ్గరగా ఏడవడం మొదలుపెట్టారు. దీంతో చుట్టుపక్కల ఇళ్లలోని వారు వారి వద్దకు వచ్చి ఏం జరిగిందని ఆరా తీశారు. వెంటనే పోలీసులు, 108 సిబ్బందికి సమాచారం అందించారు. వెంటనే అక్కడికి చేరుకున్న పోలీసులు విద్యార్థినులను నల్లగొండ జిల్లా కేంద్ర ఆస్పత్రికి తరలించారు. వారి ఆరోగ్య పరిస్థితి విషమంగా ఉన్నట్లు వైద్యులు చెబుతున్నారు.

ఇన్‌స్టాగ్రామ్‌లో బెదిరించారని

ఎందుకు ఆత్మహత్యాయత్నం చేశారని శివాని, మనీషను పోలీసులు ప్రశ్నించగా.. ఇన్‌స్టాగ్రామ్‌లో కొందరు తమను బెదిరించారని చెప్పారు. ఈ మేరకు వారిద్దరి ఫోన్లను పోలీసులు పరిశీలించగా ఇన్‌స్టాగ్రామ్‌లో ఎవరూ వారిని వేధించలేదని నిర్ధారించారు. వారి ఫోన్ కాల్ డేటాను పరిశీలించగా.. ఇద్దరు విద్యార్థినుల మధ్యే ఎక్కువగా ఫోన్ సంభాషణ ఉన్నట్లు తెలిసింది. తమ పిల్లల ఆత్మహత్యకు గల కారణాలు తెలియదని.. పోలీసులే విచారించాలని శివాని తండ్రి సైదులు, మనీష తండ్రి మల్లయ్య నల్లగొండ టూటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. గడ్డి మందును నార్కట్‌పల్లిలో కొనుగోలు చేసి ఉంటారని పోలీసులు భావిస్తున్నారు. వారి బ్యాగులో నిద్రమాత్రలు లభించాయి. విద్యార్థినులిద్దరూ ఒకరిని విడిచి ఒకరు ఉండలేమని ఆత్మహత్యాయత్నానికి పాల్పడి ఉండొచ్చని పోలీసులు భావిస్తున్నారు.

చిలుకూరు వాసికి డాక్టరేట్


బద్రం రాజు

చిలుకూరు: చిలుకూరు మండల కేంద్రానికి చెందిన బద్రంరాజు రాము ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం అనంతపురం జిల్లాలోని శ్రీకృష్ణదేవరాయ విశ్వవిదాలయం నుంచి జీవరసాయన శాస్త్రంలో డాక్టరేట్ అందుకున్నారు. రాము చిలుకూరు సమీపంలోని మిట్స్ ఇంజనీరింగ్ కళాశాలలో హెచ్ఓడీగా పనిచేస్తున్నారు. శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయంలో డాక్టర్ సరళకుమారి పర్యవేక్షణలో 'మొక్కల ఆకు రసం వలన కలిగే ప్రయోజనాలు' అనే అంశంపై చేసిన పరిశోధనకు గాను డాక్టరేట్ అందుకున్నట్లు మంగళవారం ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రామును మిట్స్ ఇంజనీరింగ్ కళాశాల అధ్యాపకులు, చిలుకూరు గ్రామస్తులు, కుటుంబ సభ్యులు అభినందించారు.

తాళం వేసిన ఇళ్లలో చోరీ

- 6 తులాల బంగారం, 60 తులాల వెండి, ల్యాప్‌టాప్, రూ.5వేల నగదు ఎత్తుకెళ్లిన దుండగులు

నల్లగొండ క్రైం: నల్లగొండ పట్టణంలోని ముషంపల్లి రోడ్డులో గల సాయన్న టౌన్‌షిప్‌లో సోమవారం రాత్రి మేరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, పవన్‌కుమార్ నివాసాల్లో గుర్తుతెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. ఎన్జీ కళాశాలలో అధ్యాపకుడిగా పనిచేసే మేరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి సోమవారం ఉదయం తన కుమార్తెను వరంగల్ ఎన్ఐటీలో చేర్పించడానికి ఇంటికి తాళం వేసి వెళ్లారు. రాత్రి దుండగులు శ్రీనివాస్‌రెడ్డి ఇంటి తాళం పగులగొట్టి లోపలికి చొరబడి 6 తులాల బంగారం, 60 తులాల వెండి, ఒక ల్యాప్‌టాప్, రూ.5వేల నగదు చోరీ చేశారు. అదేవిధంగా తాళం వేసి ఉన్న పవన్‌కుమార్ నివాసంలో చోరీకి యత్నించిన దొంగలకు ఎలాంటి సొత్తు లభించకపోవడంతో వెనుదిరిగారు. మంగళవారం ఉదయం ఇళ్లకు తిరిగొచ్చిన బాధితులు చోరీ జరిగినట్లు గుర్తించి వన్ టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ సత్యనారాయణ తెలిపారు.

ఉద్యోగం రాలేదని యువకుడి బలవన్మరణం


విక్రమ్ (ఫైల్)

పెన్‌పహాడ్: ప్రభుత్వ ఉద్యోగం రాలేదనే మనస్తాపంతో యువకుడు ఉరేసుకొని బలవన్మరణానికి పాల్పడ్డాడు. ఈ ఘటన పెన్‌పహాడ్ మండలంలోని పొట్లపహాడ్ గ్రామంలో సోమవారం రాత్రి చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. పొట్లపహాడ్ గ్రామానికి చెందిన ఎంపీటీసీ సభ్యురాలు మేకపోతుల సైదమ్మ, సీతారాములు దంపతుల పెద్ద కుమారుడు మేకపోతుల విక్రమ్(30) బీటెక్ చదివి ప్రభుత్వ ఉద్యోగాలకు సన్నద్ధమవుతున్నాడు. సోమవారం జూనియర్ లెక్చరర్ ఉద్యోగానికి సంబంధించిన పరీక్ష రాసి వచ్చాడు. ఎన్ని పరీక్షలు రాసినా ప్రభుత్వ ఉద్యోగం రాకపోవడంతో మనస్తాపానికి గురైన విక్రమ్ సోమవారం రాత్రి ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. కుటుంబ సభ్యులు వచ్చి చూసేసరికి అప్పటికే మృతిచెందాడు. 'నా చావుకు ఎవరూ కారణం కాదు' అని రాసిన సూసైడ్ నోట్ మృతుడి వద్ద లభించింది. కాగా విక్రమ్‌కు దామరచర్ల గ్రామానికి చెందిన యువతితో జూలైలో ఎంగేజ్‌మెంట్ కాగా నవంబర్‌లో పెళ్లి జరగాల్సి ఉంది. ఈ ఘటనకు సంబంధించి తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని ఎస్‌ఐ నర్సింగ్ వెంకన్నగౌడ్ తెలిపారు.

మట్టపల్లి క్షేత్రంలో నిత్యకల్యాణం

మఠంపల్లి: మట్టపల్లి శ్రీలక్ష్మీనృసింహస్వామి దేవాలయంలో శ్రీరాజ్యలక్ష్మి,చెంచులక్ష్మి సమేత శ్రీలక్ష్మీనృసింహస్వామి నిత్య కల్యాణాన్ని మంగళవారం అర్చకులు వేదమంత్రాలతో వైభవంగా నిర్వహించారు. ఈసందర్భంగా ఆలయంలో సుప్రభాత సేవ, నిత్యహోమం, మూలవిరాట్ స్వామికి పంచామృతాభిషేకం చేశారు. అదేవిధంగా శ్రీలక్ష్మీ నరసింహస్వామి, రాజ్యలక్ష్మి చెంచులక్ష్మి అమ్మవార్లకు అష్టోత్తర, సహస్ర, కుంకుమార్చనలు గావించారు. నూతన పట్టు వస్త్రాలతో స్వామిఅమ్మవార్లను వధూవరులుగా అలంకరించి ఎదుర్కోళ్లమహోత్సవ సంవాదం చేపట్టారు. అనంతరం విశ్వక్సేన పూజ, పుణ్యాహవచనం, రక్షాబంధనం , పంచగవ్య ప్రాశన, ఋత్విగ్వరణం, మధుపర్క పూజ ,మాంగల్య ధారణ, తలంబ్రాలతో వైభవంగా నిర్వహించారు. ఆలయప్రాంగణంలోని క్షేత్రపాలకుడైన శ్రీఆంజనేయస్వామికి తమలపాకులపూజ, అర్చనలు నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. ఈకార్యక్రమంలో ఆలయ అనువంశిక ధర్మకర్తలు చెన్నూరు విజయ్‌కుమార్, మట్టపల్లిరావు, ఈఓ నవీన్, అర్చకులు కృష్ణమాచార్యులు, శ్రీనివాసాచార్యులు, బ్రహ్మాచార్యులు, పద్మనాభాచార్యులు, బదరీనారాయణాచార్యులు, ఫణిభూషణమంగాచార్యులు, దేవీసత్యప్రసాద్, అప్పలాచార్యులు, లక్ష్మీనరసింహమూర్తి, ఆంజనేయాచార్యులు , భక్తులు పాల్గొన్నారు.

నేడు విద్య, ఉపాధి మేళా

నల్లగొండ : ఇంటర్మీడియట్ ఉత్తీర్ణులైన వారికి హైదరాబాద్‌కు చెందిన ఎంఎస్ఎన్ గ్రూప్ ఆఫ్ కంపెనీలో ఉపాధితో పాటు ఉన్నత విద్యా సౌకర్యం కల్పించేందుకు బుధవారం నల్లగొండలోని జ్యోతి ఒకేషనల్ జూనియర్ కాలేజీ జాబ్ మేళా నిర్వహించనున్నట్లు నల్లగొండ జిల్లా ఉపాధి కల్పన అధికారి పద్మ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2022-2023 సంవత్సరంలో ఇంటర్మీడియట్ ఉత్తీర్ణులై ఉండాలని ఆమె పేర్కొన్నారు. ఎంపికైన వారికి రూ.11,000 వేతనం, కుటుంబ సభ్యులకు స్టేట్ ఇన్సూరెన్స్ ఇవ్వనున్నట్లు తెలిపారు. హైదరబాద్‌లోని ప్రఖ్యాత విశ్వ విద్యాలయం నుంచి ఉచిత ఉన్నత విద్య స్పాన్సర్ చేస్తున్నారని తెలిపారు. వివరాలకు 70759 86130, 70956 12963, 98490 03379 ఫోన్ నంబర్లను సంప్రదించాలని పేర్కొన్నారు.